క్లుప్తంగా

జేబీకే పురం రైల్వేగేటు మూసివేత

● మరమ్మతుల కోసం మూడు రోజుల పాటు..

కంభం: మండలంలోని చిన్నకంభం సమీపంలో ఉన్న జగ్గంబొట్ల కృష్ణాపురం రైల్వే గేటు(నెం.217) వద్ద ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 21వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం నుంచి తురిమెళ్ల, రాచర్ల, గిద్దలూరు వైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలోగుండా రైల్వే గేటు నంబర్ 216 మీదుగా వెళ్లాలని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉగాది కానుకగా పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేసి, వెంటనే ఐఆర్ వెంటనే ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్త ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ సభ్యులు డిమాండ్ చేశారు.

'వెలిగొండ' సమస్యలపై ధర్నాను జయప్రదం చేయండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న బాలనాగయ్య

మార్కాపురం టౌన్: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో మరో రూ.1500 కోట్లు కేటాయించి, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య కోరారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని వేములకోట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములపేట, చింతగుంట్ల మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలని కోరారు.

కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు



కాటంరాజు చరిత్రను చూపుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మార్కాపురం: ఈనెల 29న కాటంరాజు, గంగాభవాని తిరునాళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాదయాదవ్, కమిటీ అధ్యక్షుడు వెంకటరావు యాదవ్ తెలిపారు. మంగళవారం బీసీ భవన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు అన్నదానం చేయడంతోపాటు మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేవారు కమిటీని సంప్రదించాలని సూచించారు. కాటంరాజు స్వామివారి చరిత్రను రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు తంగిరాల సుబ్బారావు రచించగా పుస్తక రూపంలోకి తెస్తున్నామన్నారు. ఆలయం వద్ద భోజనశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పి.పోలురాజు, ఒ.నాగేశ్వరరావు, జి.గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్ యాదవ్, నాగం వెంకటేష్, గాలెయ్య, గోపాల్‌రాజు, ముప్వా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బయనపల్లె మహిళకు గణితంలో డాక్టరేట్



డాక్టరేట్ పొందిన వనజగోష్టి

గిద్దలూరు రూరల్: మండలంలోని ఎస్.బయనపల్లెకు చెందిన బి.వనజగోష్టి గణితశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. గణితశాస్త్రంలో 'ఎఫెక్ట్స్ ఆఫ్ బౌండరీ స్లిప్ అండ్ వేరియబుల్ ఫిజికల్ ప్రాపర్టీస్ ఆన్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టు ఫ్లూయిడ్ ఫ్లోస్ ఇన్ ఏ వర్టికల్ చానల్' అంశంపై వనజగోష్టి చేసిన పరిశోధనకుగాను సత్యసాయి జిల్లాలోని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా ఆమెను వైఎస్సార్ సీపీ ఆర్యవైశ్య విభాగం నాయకులు పెండేల కిరణ్‌కుమార్, తుమ్మలపెంట సురేష్, దుర్గారావు, సత్యనారాయణ, కంచర్ల రవి అభినందనలు తెలియజేశారు.

డేంజర్..యమ డేంజర్!

● సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రయాణం ప్రమాదకరం
● బడ్స్ అమర్చుకుని ప్రమాదాల బారిన పడుతున్న యువకులు
● ఘాట్ రోడ్లలో జాగ్రత్తలు తప్పనిసరంటున్న పోలీసులు



సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైకు నడుపుతున్న యువకుడు

పెద్దదోర్నాల:

సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడిపే వారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువవుతోంది. సెల్‌ఫోన్లలో లీనమైన కొంత మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు మండల పరిధిలో నిత్యం చోటుచేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపటం తప్పని తెలిసినా చాలా మంది వాహనదారుల్లో మార్పు రావడం లేదు. ముఖ్యంగా మండల కేంద్రంలోని చాలామంది యువకులు సెల్‌ఫోన్లలో మాట్లాడటంతో పాటు తమ వాహనాలను నిర్లక్ష్యంగా, అత్యంత వేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు.

సెల్‌ఫోన్లలో మాట్లాడటం ప్రమాదకరం

వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్లలో మాట్లాడటం ప్రమాదకరమైనా చాలామంది వాహనదారులు ఫోన్లలో మాట్లాడుతూనే వాహనాలు నడుపుతున్నారు. దీంతో పాటు చాలామంది యువకులు పరీక్షలైపోయాయనే ధీమాతో వాహనాలను వారికి ఇష్టమైన రీతిలో నడుపుతున్నారు. ముఖ్యంగా శ్రీశైలం రహదారిలోని చిన్న మూల టర్నింగ్, పెద్ద మూల టర్నింగ్ ప్రాంతాల్లో తమకు ఇష్టమైన వారితో సెల్‌ఫోన్లు మాట్లాడుతూ బైక్‌లపై ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ చేస్తున్న ప్రయాణాలతో ప్రమాదం పొంచి ఉందని యువకుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అలా ప్రయాణాలు సాగిస్తున్న వారిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారికి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. కొందరు విద్యార్థులు, యువకులు, ఇయర్ ఫోన్లు, బడ్స్‌ను చెవులకు అమర్చుకుని వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. మండల పరిధిలోని శ్రీశైలం, కర్నూల్ రహదారులు నలమల్ల అభయారణ్యం పరిధిలో ఉంటాయి. దీంతో పాటు ఆయా రోడ్లలో సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా ఉండదు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం మంది యువకులు ఇయర్ ఫోన్లలో పాటలు వింటూ ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో వెనుకగా వచ్చే వాహనాలు ఇచ్చే హారన్ సౌండ్‌లు వినబడక ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందంటున్నారు. ఇలా డ్రైవింగ్ చేసే వారికి ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసులను కోరుతున్నారు.

> **డ్రైవింగ్ చేస్తూ సెల్ మాట్లాడటం ప్రాణాంతకం**
>
> డ్రైవింగ్ చేస్తూ వాహనాలు పడపటం ప్రాణాంతకం. ఇలా వాహనాలు నడిపే వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. శ్రీశైలం, కర్నూల్ రహదారుల్లో ప్రయాణాలు కొనసాగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా డ్రైవింగ్ చేస్తూ ఫోన్లలో మాట్గాడటం లేదా ఇయర్ ఫోన్లలో పాటలు వినటాన్ని పక్కనున్న వారు నివారించాలి.
>
> ఎస్సై మహేష్, పెద్దదోర్నాల

కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



పెద్దారవీడు: మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి



దొనకొండ: రైతులతో మాట్లాడుతున్న ఏఓ

దొనకొండ: పడమర కంభంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆరవల్లిపాడులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. రైతులు తాము పండించిన కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర రూ.7550 అమ్ముకుంటే మంచి ధరతో పాటు వెంటనే వారి బ్యాంక్ ఖాతాలో జమవుతాయని ఏఓ తెలిపారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కందుల కొనుగోలు కేంద్రం ద్వారా కందులు అమ్ముకునేందుకు రైతులు ఈ-పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని, ఆధార్ కార్డు తీసుకుని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2391 మంది రైతులు సుమారు 5,500 ఎకరాల్లో కంది సాగు చేశారన్నారు. అనంతరం తెల్లబాడు, పంచాయతీ కార్యాలయంలో ఆయన రైతులతో మాట్లాడి సూచన, సలహాలందించారు. ఆయన వెంట సిబ్బంది ధనరాజ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో కందులు అమ్ముకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని మారెళ్ల, జమ్ములమడక గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ మండలంలో కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7550గా నిర్ణయించామన్నారు. 2024లో ఈ-పంట నమోదు చేయించుకున్న రైతుల తుది జాబితా ఆర్ఎస్‌కేల వద్ద ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న వ్యక్తిగత పనిముట్ల కోసం ఆర్ఎస్‌కేల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మనందరెడ్డి, ఏఓ ఎండీ ఫరూక్, గ్రామ వ్యవసాయ సహాయకులు వై.రాధామణి, టి.బాల వెంకటయ్య పాల్గొన్నారు.

పెద్దారవీడు: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో కందులు, శనగలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. పెద్దారవీడు పంచాయతీ సిద్దినాయునిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కందులు, శనగలు పండించిన రైతులు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ముందుగా సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి అవగాహన కల్పించారు. ఇంకా రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు ఉంటే వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం సొంత భూములు ఉన్న రైతులకు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, త్వరలో అసైన్‌మెంట్ భూముల రైతులకు కూడా చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. వీఏఏ డి.ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

పంట నమోదు జాబితా సరిచూసుకోండి



బేస్తవారిపేట : పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ మెర్సీ



మార్కాపురం : రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసులు

● ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో జాబితాను సరిచూసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ డి.బాలాజీనాయక్ సూచించారు. మంగళవారం జేబీకే పురం, చెట్టిచర్లలో గ్రామ సభలు నిర్వహించారు. జాబితాలో తప్పులు ఉంటే ఈనెల 22వ తేదీలోగా వీఏఏలకు అర్జీలు అందజేయాలని తెలిపారు. కందులు, శనగ పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. పంట ఉత్పత్తులను విక్రయించే రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఏఓ కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, ఏఈఓ ఆదిగణేష్ పాల్గొన్నారు.

బిందు సేద్యంతో ఎన్నో లాభాలు

కొమరోలు: బిందు సేద్యం పద్ధతిలో పంటలు పండిస్తే రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని అల్లినగరం, గోనపల్లె గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. భూగర్భ జలాలు తగ్గుతున్నందున పంటలకు నీటిని సమర్థవంతంగా అందించేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాయితీలను వినియోగించుకోవాలని సూచించారు. ఏఓ రాజశ్రీ, ఏపీఎంఐబీ ఏరియా ఆఫీసర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తంకండి

మార్కాపురం టౌన్: ఖరీఫ్ సీజన్‌కు రైతులు సమాయత్తం కావాలని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మే నెలలో రైతులు తమ పొలాలను లోతు దుక్కులు చేసుకోవాలని, భూమి సారవంతం కావాలంటే పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు.

21న అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



అభయాంజనేయ స్వామి

పొదిలి రూరల్: పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని ఒంగోలు-కర్నూలు రహదారి ముసి బ్రిడ్జి వద్ద కొలువై ఉన్న అభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయక స్వామి తిరునాళ్ల ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ కార్యనిర్వాహకులు ధర్మవరపు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆకు పూజ, మధ్యాహ్నం, సాయంత్రం ఆలయం వద్ద ఉన్న కాశీనాయనసత్రంలో అన్న సంతర్పణ చేయనున్నట్లు వివరించారు. రాత్రికి ఏలూరు గ్రామంలో విద్యుత్ ప్రభలు, కోలాటం, బ్రహ్మంగారి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం ఆలయ పరిసరాలు, ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను ఎస్సై వేమన పరిశీలించారు. శాంతియుత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

వెలుగొండ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డితో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. ఎడ్ల పోటీలు, అన్నదాన సత్రాల నిర్వహణ, తిరునాళ్లలో షాపుల ఏర్పాటు, ట్రాఫిక్ తదితర అంశాలు, ఇతర ఏర్పాట్లపై ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. మూడు రోజులపాటు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్సై వెల్లడించారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి



బొల్లికొండ రాయస్వామి ఆలయం



స్వామి వారి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని పడమరనాయుడుపాలెం, ఆవులమంద, కల్లూరు గ్రామాల కూడలిలో వేంచేసి ఉన్న శ్రీబొల్లికొండ రాయస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం తిరునాళ్ల జరగనుంది. ఈ నెల 14వ తేదీన అంకురార్పణ చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. కోరిన కోర్కెలు తీర్చేస్వామిగా సంతాన ప్రదాతగా స్వామికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సంతాన వెంకటేశ్వరస్వామిగా కూడా ఈ ప్రాంత ప్రజలు కొలుస్తుంటారు. ఈ ప్రాంతంలో స్వామివారి అనుగ్రహంతో కలిగిన సంతానానికి బొల్లికొండయ్య, బొల్లికొండమ్మ అంటూ నామకరణం చేయటం ఆనవాయితీగా మారింది. తిరునాళ్ల సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు ఏడు విద్యుత్ ప్రభలు, రెండు కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

యాంత్రీకరణతో బహుళ ప్రయోజనాలు



కూలీలతో మాట్లాడుతున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: వ్యవసాయంలో యాంత్రీకరణతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లూరు1, 2 రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ కాయలను విడదీసే యంత్ర పరికరం వినియోగించే విధానం రైతులకు వివరించారు. ఈ యంత్రం 2 హెచ్‌పీ మోటార్ సాయంతో నడుస్తుందని, పొలం నుండి తీసిన పంటను ఎండబెట్టే అవసరం లేకుండా వెంటనే ఈ యంత్ర సాయంతో కాయలను వేరు చేయవచ్చని చెప్పారు. వీఏఏ వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దారవీడు: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో మండలంలోని కలనూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు దుప్పట్లు ప్రెసిడెంట్ చీదెళ్ల లక్ష్మణరావు మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటరావు మాట్లాడుతూ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు లక్ష్మణరావు స్నేహితుల సాయంతో గతంలో కూడా పాఠశాల తరగతి గదుల్లో రూ.20 వేల విలువైన ఫ్యాన్లు, విద్యుద్దీకరణ, లక్ష్మణరావు తన సొంత నిధులతో పేద పిల్లలకు బట్టలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. వారం రోజుల క్రితం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నేహితుల సాయంతో పరీక్షలకు ఉపయోగపడే అట్టలు, పెన్నులు అందజేశారని తెలిపారు. అవోపా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పాఠశాలలకు ఏదో విధంగా సహకారం చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి పలువురికి సేవ చేసే గుణం అలవర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు బట్టు రామకృష్ణ, సీహెచ్ మహేష్, బి.మల్లికార్జునరావు, బి.శ్రీరాములు, కె.సులోచనరాణి, సీహెచ్ కృష్ణారెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న రమేష్

దర్శి: మీటర్ రీడర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ కార్యదర్శి మాడపాకుల రమేష్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాచపూడి కరుణానిధి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మీటర్ రీడర్‌లతో పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డు, పొదిలి రోడ్డులో ర్యాలీ నిర్వహించి ఈఈ కార్యాలయానికి చేరుకున్నారు. ఈఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్, కరుణానిధిలు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు బిగించమని హామీ ఇచ్చారన్నారు. ఎక్కడైనా స్మార్ట్ మీటర్లు కనిపిస్తే పగలగొట్టమని చెప్పి ఆయన కూడా ఒక మీటర్‌ను పగలగొట్టారని గుర్తు చేశారు. సంస్థలోనే స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కింద ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ప్లేట్ తిప్పేశారని ఎద్దేవా చేశారు. హామీలన్నీ గాలికి వదిలేసి వాళ్లే ఇచ్చిన మాట తప్పి స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో తమ ఉపాధికి ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, మీటర్ రీడర్ యూనియన్ నాయకులు షేక్ మస్తాన్ వలి, పసుపులేటి దత్తాత్రేయ, సురేష్, నరేష్, బాలకృష్ణ, వెంకట నరసయ్య, మణికంత, వీరాంజనేయులు, బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.